క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

శ్రీరంగరాజపురం : డిప్యూటీ సీఎం నారాయణ స్వామి పలు ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని ఎంపీడీవో మోహన్ మురళి తెలిపారు. ఉదయం 9 గంటలకు శ్రీరంగరాజపురంలోని పాలశీతల కేంద్రం, 10 గంటలకు 49–కొత్తపల్లి మిట్టలోనున్న పాలశీతల కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు. 11 గంటలకు వి.వి.పురం సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 12 గంటలకు బహిరంగ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయండి


ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వైద్యులు

శ్రీరంగరాజపురం : మార్చి 3వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో మోహన్ మురళి తెలిపారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లతో పల్స్ పోలియోపై వైద్యాధికారి డాక్టర్ సందీప్, గిరి, గౌరి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో ఎంపీడీవో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రానికి రాలేని పిల్లలను గుర్తించి ఇంటి వద్దే పోలియో చుక్కలు వేయాలన్నారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరినీ సమీప కేంద్రానికి వచ్చేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం పల్స్ పోలియో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఏవో కృష్ణయ్య, ఎంఈవో అరుణాచలంరెడ్డి, సూపర్‌వైజర్ గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


డెస్కులపై హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న చీఫ్ సూపరింటెండెంట్ వినాయకం

పాలసముద్రం : మండలంలోని ఇంటర్ పబ్లిక్ పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ధనుంజయ తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 60 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 75 మంది పరీక్షలు రాస్తున్నట్టు తెలిపారు. వారికి డెస్కులు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించామన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు పెట్టామన్నారు. ఉదయం 8 నుంచి 9 గంటలోపు విద్యార్థులు కేంద్రానికి హాల్ టికెట్‌తో చేరుకోవాలని, 9 గంటలకు పైన వచ్చిన వారిని అనుమతించబోమని చీఫ్ సూపరింటెండెంట్ వినాయకం, డిపార్టుమెంట్ ఆఫీసర్ జ్ఞానశేఖర్ తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం : అంగన్‌వాడీ కేంద్రంలో బరువు తక్కువ ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. ఆయన గురువారం పాలసముద్రం , సన్నగుంట అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, భోజనానికి ముందు ఉడికించిన కోడి గుడ్డు ఇవ్వాలని తెలిపారు. అనంతరం చిన్నారులకు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, రాధ, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

10వ తరగతి ప్రీ ఫైనల్ పరీక్షల తనిఖీ


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో

నగరి: మండలంలో నిర్వహిస్తున్న 10వ తరగతి ప్రీఫైనల్ పరీక్షలను ఎంఈవో నమశ్శివాయం పరిశీలించారు. గురువారం మండలంలోని ముడిపల్లెకు వెళ్లి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పబ్లిక్ పరీక్షలంటే ఎలాంటి భయం లేకుండా విద్యార్థులు రాసేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దిగ్బంధానికి తొలగిన తెర

- 3 దశాబ్దాల సమస్య మంత్రి చొరవతో పరిష్కారం
- రూ. 60 లక్షలతో అభివృద్ధి పనులు
- భూమిపూజ చేసిన సెల్వమణి, ఎంపీపీ


వేలావడి ఎస్టీ కాలనీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఆర్కే సెల్వమణి


కావేటిపురం దళితవాడ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఆర్కే సెల్వమణి

నగరి : తుపాను సమయాల్లో రూరల్ మండలంలోని వేలావడి ఎస్టీకాలనీ జలదిగ్బంధంలో చిక్కుకునేది. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి వారు పడే అవస్థలు వర్ణనాతీతం. వర్షాలు తగ్గితే తప్ప బయటి ప్రపంచంతో కలిసేందుకు వీలు కలిగేది కాదు. ఇది మూడు దశాబ్దాలుగా ఉన్న సమస్య. వరద నీటిలో నడుచుకుంటూ వెళ్లి ఓట్లు వేయించుకోవాలని ప్రయత్నించిన నాయకులెవరూ వారి సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపకపోవడం శాపమైంది. 40 కుటుంబాలున్న ఎస్టీకాలనీకి ఎందుకు అంత ఖర్చుచేయాలి? ఉన్న ఓట్లకు అంత ఖర్చుపెట్టాలా? అని వెనకడుగు వేసేవారే ఎక్కువ. అలాగే బీరకుప్పం పంచాయతీ కావేటిపురం దళితవాడకు ఊరు నుంచి పక్కారోడ్డు లేదు. రాళ్లురప్పలతో నిండిన మట్టిరోడ్డు మాత్రమే ఉండేది. భూముల సమస్య ఉండడంతో పక్కా రోడ్డు వేయడానికి గత పాలకులెవరూ ముందుకు రాలేదు. దీంతో పక్కా రోడ్డు వీరికి కలగానే మిగిలిపోయింది. ఉన్న ఓట్లకన్నా నివాసితులకు సౌకర్యాలు కల్పించడమే ప్రధానంగా ఎంచి మంత్రి ఆర్కేరోజా ఈ రెండు ప్రాంతాలకు పక్కా రోడ్డు నిర్మించేందుకు దృష్టి సారించారు. రోడ్డు పనులకు తుడా నిధులు మంజూరు చేయించారు. దీంతో గురువారం వేలావడి ఎస్టీకాలనీకి రూ.35 లక్షలతో నిర్మించే రోడ్డుకు, కావేటిపురం దళితవాడకు రూ. 10 లక్షలతో నిర్మించే రోడ్డుకు, బీరకుప్పంలో 15 లక్షలతో నిర్మించనున్న సిమెంటు కాలువలకు రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరి, సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీలు చంద్రారెడ్డి, జ్యోతి, కో–ఆప్షన్ సభ్యుడు దస్తగిర్, నాయకులు వేలాయుధం, ఖాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ఎన్నికల నియమావళి పాటించాలి


ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న డీటీ విజయకృష్ణ

గంగాధర నెల్లూరు: ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది, అధికారులు తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని పాటించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఈవీఎంల పనితీరు, ఎదురయ్యే సమస్యలు, పరిష్కరించే విధానాలపై పీవోలు, ఏపీవోలు, సెక్టోరల్ అధికారులు, తహసీల్దారులకు ఎలక్షన్ డీటీ విజయకృష్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దారులు సుబ్బలక్ష్మమ్మ, సుభద్రమ్మ, పుష్పకుమారి, ఆనందమోహన్ పాల్గొన్నారు.

రోడ్డు పనులను అడ్డుకుంటున్న టీడీపీ నేత

- గత టీడీపీ ప్రభుత్వం పనులు పూర్తి చేయని వైనం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తుంటే కోర్టు నిలిపివేత
- అవస్థలు పడుతున్న చెర్లోపల్లె గ్రామస్తులు


కోర్టు ఆర్డర్ కాపీలను చూపుతున్న చెర్లోపల్లె గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పుత్తూరు: పుత్తూరు మున్సిపాలిటీ 21వ వార్డు చెర్లోపల్లె రోడ్డు పనులకు టీడీపీ మాజీ కౌన్సిలర్ ఇ.బాబురావు అడ్డుపడుతుండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వార్డు కౌన్సిలర్ ఎస్.జ్యోతి, మున్సిపల్ చైర్మన్ ఏ.హరి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం చెర్లోపల్లె రోడ్డు దుస్థితిని చూపుతూ మీడియా సమావేశం నిర్వహించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఈశ్వరయ్యయాదవ్ మాట్లాడుతూ, 2018 అక్టోబర్ 10న అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్ ఎస్‌డీఎఫ్ గ్రాంట్ కింద చెర్లోపల్లె రోడ్డు పనులకు రూ.55 లక్షలు మంజూరు చేసి, 2019 మార్చి 31లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారన్నారు. ఆ పనులు పొందిన టీడీపీ నాయకుడు ఇ.బాబురావు ఏప్రిల్ 2024 నాటికి 45 శాతం పనులు మాత్రం చేసి నిలిపి వేశారన్నారు. దీంతో ఆ పనికి సంబంధించిన నిధులు విడుదల కాలేదన్నారు. 2022 సెప్టెంబర్‌లో ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.25 లక్షలతో సీసీ రోడ్డు పనులకు టెండర్లు ఆహ్వానిస్తే దీనిపై 2023లో బాబురావు హైకోర్టులో కేసు వేయడంతో పనులు ఆగిపోయాయన్నారు. బాబురావు అభ్యర్థన మేరకు ఆయన చేసిన పనిని క్వాలిటీ కంట్రోల్ బోర్డు పరిశీలించి, బిల్లు చెల్లించాల్సిందిగా కోర్టు ఆదేశించిందన్నారు. ఈ నేపథ్యంలో 2024 ఫిబ్రవరిలో జనరల్ ఫండ్స్ రూ.2 లక్షలతో క్రషర్ డస్ట్‌తో రోడ్డు మరమ్మతులకు టెండర్లు పిలిచారని, దీనిని సైతం ఆన్‌లైన్ ద్వారా బాబూరావు దక్కించుకున్నారని, పనులను మాత్రం ఇప్పటివరకూ చేసిన పాపానపోలేదని ఆరోపించారు. ఇలా చెర్లోపల్లె రోడ్డు పనులకు పలు విధాలుగా అడ్డుపడడం, అలాగే పట్టణంలో చేస్తున్న పలు అభివృద్ధి పనులను కోర్టులకెళ్లి నిలుపుదల చేయించడం టీడీపీ నాయకులకు రివాజుగా మారిందని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో వీరికి ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. మంత్రి ఆర్కే రోజా తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రోడ్డు పనులను పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. సమావేశంలో చెర్లోపల్లె గ్రామ పెద్దలు గోపాల్‌యాదవ్, వెంకయ్యరెడ్డి, కుమార్‌యాదవ్, శివయ్యయాదవ్, చెంగారెడ్డి, మునయ్య, కుమార్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, లోకనాథరెడ్డి, బాలకృష్ణ, ఆదీశ్వరయ్య, సుబ్రమణ్యంయాదవ్, ఆదమ్మ, అమ్ములు, గుర్రమ్మ, లక్ష్మమ్మ, రోసిమండడి, నీలకంఠారెడ్డి, జయరామయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా కోదండన్


ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి నుంచి నియామక పత్రం అందుకుంటున్న కోదండన్

గంగాధర నెల్లూరు: వైఎస్సార్ సీపీ చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధిగా గంగాధర నెల్లూరు మండలం వీరకనెల్లూరుకు చెందిన డి.కోదండన్‌ను నియమించినట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేఆర్‌జే భరత్ తెలిపారు. ఆయన గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కోదండన్ గురువారం ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామిని కలిసి నియామక పత్రాన్ని అందుకున్నారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు సీఎం జగనన్న, డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు భరత్‌కు కోదండన్ కృతజ్ఞతలు తెలిపారు. 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

భూసార పరీక్ష .. పంటలకు శ్రీరామరక్ష


మట్టి నమూనాలను సేకరించే విధానాన్ని చూపిస్తున్న అధికారులు

పాలసముద్రం : రైతులు పంటలు సాగు చేసే ముందు భూసారం తెలుసుకోవడానికి మట్టి పరీక్ష చేయించాలని, తద్వారా భూమికి, పంటకు శ్రీరామరక్ష కలుగుతుందని మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు. ఆయన గురువారం చెరువు ముందర కండ్రిగ గ్రామంలో రైతులకు భూసార పరీక్ష చేయడం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పంట కోతలు ముగిసిన నెల రోజుల తర్వాత మట్టి నమూనాలు సేకరించాలన్నారు. వాటిని పరీక్ష చేయించడం ద్వారా పంట పండించాలో తెలుస్తుందన్నారు. అధిక దిగుబడులు వస్తాయన్నారు. ప్రభుత్వం భూసార పరీక్షలు చేసి రైతులకు కార్డులు అందించే కార్యక్రమం చేపట్టిందన్నారు. రసాయన ఎరువులు అధికంగా వాడడం వల్ల భూమిలో సారం తగ్గి పంట దిగుబడి తగ్గిపోతుందన్నారు. అనంతరం రైతులకు మట్టి నమూనా సేకరించే విధానాన్ని చూపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అన్బలగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచ్ గాలి మహేష్ బాబు, వ్యవసాయ సహాయకులు వనజ, రైతులు సుబ్రమణ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

- తుడా నిధులు రూ.51 లక్షలతో సీసీ డ్రైనేజీలు
- వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి


భూమి పూజ చేస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు జోరుగా చేస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం వడమాలపేట పంచాయతీలో రూ.33 లక్షలు, రామసముద్రంలో రూ.18 లక్షలతో సీసీ డ్రైనేజీ నిర్మాణాలకు ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. మంత్రి రోజా అభ్యర్థన మేరకు మంజూరైన తుడా నిధులతో పలు అభివృద్ధి పనులు శరవేగంగా చేస్తున్నారన్నారు. ఇప్పటికే వడమాలపేట మండలంలో పలు అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మునెమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు నందయ్య, రాజారెడ్డి, సురేషరాజు, నిరంజన్‌బాబు, చంద్ర, భరత్, శివ, మునిబాబు, రాజశేఖర్, ఉపేంద్ర, సుధీర్‌రెడ్డి, చంద్రారెడ్డి, మునిశేఖర్, రవి, సదాశివయ్య, వెంకటరెడ్డి, రమేష్, ఉమాపతి, పంచాయతీ కార్యదర్శి శ్రీలేఖ పాల్గొన్నారు.

ఫ్లెక్సీ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పుత్తూరు: పట్టణానికి చెందిన కార్మికుడు వాసు ఇంటి మీద ఇటీవల ఫ్లెక్సీ బోర్డు పడి, షార్ట్ సర్క్యూట్ సంభవించి ఇంటిలోని వస్తువులన్నీ ధ్వంసం అయ్యాయి. దీంతో ఆర్థికంగా చితికి పోయిన వాసు పరిస్థితిని తెలుసుకొన్న వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి గురువారం రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. వాసు దంపతులు మంత్రి ఆర్కే రోజాకు, రామ్‌ప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు పుత్తూరులో హార్స్ షో

పుత్తూరు: స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు తిరుపతికి చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రవీణ, చిట్టేష్‌రావ్ హార్స్ షో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా హాజరవుతారని, కార్యక్రమంలో హార్స్ జంపింగ్, టెంట్ పెగ్గింగ్ వంటి ఈక్వెస్ట్రియన్ ప్రదర్శన ఉంటుందని, ఈ ప్రదర్శనను ప్రజలు కూడా తిలకించవచ్చని తెలియజేశారు. ప్రవీణ, చిట్టేష్‌రావ్ ఈ ఏడాది జనవరిలో ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో రెండు బంగారు, రెండు రజత పతకాలు సాధించడం విశేషమన్నారు.

రక్తదాన శిబిరం

కళాశాలలో శుక్రవారం ఉదయం 10 గంటలకు తిరుపతి స్విమ్స్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

4న జంతు వధశాల వేలం

నగరి : మున్సిపల్ పరిధిలోని జంతు వధశాలపై గుత్త వసూలు చేసుకునేందుకు ఈ నెల 4న వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనవచ్చన్నారు.

తడి, పొడిచెత్త సేకరణకు 9 ఎలక్ట్రిక్ ఆటోలు



ఎలక్ట్రికల్ ఆటోలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

నగరి: మున్సిపాలిటీలో తడి, పొడిచెత్త సేకరణకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి నగరి మున్సిపల్ కార్యాలయానికి 9 ఎలక్ట్రిక్ ఆటోలు మంజూరయ్యాయి. గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద వీటికి మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం జెండా ఊపి ప్రారంభించారు. ఎలక్ట్రికల్ ఆటోలకు రూ.99 వేలతో ఈటీపీ ప్రాంగణంలో చార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. చెత్త సేకరణలో సిబ్బంది చురుకుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బాలాలయ పూజలు


బాలాలయ పూజల్లో భక్తులు

నగరి: స్థానిక బస్టాండు సమీపంలోని పాలమునీశ్వర స్వామి ఆలయంలో గురువారం బాలాలయ పూజలు నిర్వహించారు. నవగ్రహ పూజ, హోమం, మహా పూర్ణాహుతి, ప్రోక్షణ పూజలు చేశారు. భక్తులు మునీశ్వరస్వామికి పొంగళ్లు పెట్టి మొక్కుకున్నారు.

మరిన్ని అభివృద్ధి పనులకు గ్రీన్‌సిగ్నల్

- సాధారణ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్

నగరి: మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నందుకుగాను మంత్రి ఆర్కేరోజాకు మున్సిపల్ కౌన్సిల్ ధన్యవాదాలు తెలిపింది. గురువారం నగరి మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. తొలుత మున్సిపల్ అధికారులు సమావేశ అజెండాను నివేదించారు. ఈ కౌన్సిలర్లు తమ వార్డుల్లో ఇదివరలో చేసిన అభివృద్ధిని, ప్రస్తుతం చేపట్టవలసిన పనులను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, మంత్రి రోజా సహకారంతో పార్కు నిర్మించామని, రూ.1.75 కోట్లతో శ్మశానవాటిక ఆధునీకరణ, కీళపట్టు మార్గంలో వంతెనను నిర్మించనున్నట్టు తెలిపారు. రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. ఏరియా ఆస్పత్రిని రూ.5 కోట్లతో ఆధునీకరించి ఆక్సిజన్ ప్లాంటులు ఏర్పాటు చేసుకున్నామని, అతిత్వరలో డయాలసిస్ వార్డు ప్రారంభం కానుందన్నారు. ఇలాంటి అభివృద్ధి పనులు ఇదివరకు ఎన్నడూ చేయలేదని, ప్రజావసరాలకు తగిన విధంగా అభివృద్ధి పనులతో ముందుకెళ్తున్నట్టు స్పష్టం చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిల్ ఆమోదించిన అంశాలు

- శ్మశానవాటికలో రూ.42 లక్షలతో ఎల్‌పీజీ గ్యాస్ ఫర్నేస్, చిమ్నీ అమర్చుట
- రూ.50 లక్షలతో నిర్మించే రోడ్లు, కాలువల నిర్మాణానికి సంబంధించి టెండర్లకు ఆమోదం
- రూ.8 లక్షలతో కాకవేడు రెవెన్యూ, జీవీఎస్ నగర్ ఎక్స్‌టెన్షన్‌లో కమ్యూనిటీ హాలు నిర్మాణం
- రూ.22 లక్షలతో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లకు ప్రహరీ, గేటు, వాహన షెడ్డు ఏర్పాటు
- 2024–25 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌కు పరిపాలనా ఆమోదం

విద్యాబోధన నూతన ఆవిష్కరణలకు నాంది


మాట్లాడుతున్న పీవీకేఎన్ ప్రిన్సిపల్ జీవనజ్యోతి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రస్తుత విద్యాబోధన నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి అన్నారు. కళాశాలలో గురువారం అధ్యాపకులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఆమె మాట్లాడుతూ 2020 నూతన విద్యావిధానం ప్రకారం డిగ్రీ కళాశాలల్లో సింగిల్ మేజర్ విధానం ప్రారంభమైందని చెప్పారు. ఇకపై డిగ్రీ కళాశాలల్లో ఒక సబ్జెక్టును మాత్రమే మేజర్ సబ్జెక్టుగా ఎంచుకుని విద్యార్థులు అభ్యసించవచ్చన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో ఒక సబ్జెక్టును మైనర్ సబ్జెక్టుగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ విధానంపై అవగాహన కల్పించేందుకు వృక్షశాస్త్ర అధ్యాపకులకు ఐదు రోజులు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అధ్యాపకులు శిక్షణలో తమ పరిజ్ఞానం మరింత పెంచుకుని ఉత్తమ విద్యాబోధనతో విద్యార్థులకు తీర్చిదిద్దాలన్నారు. శిక్షణా కార్యక్రమానికి సమన్వయకర్తగా జయచంద్రుడు వ్యవహరించారు. చిత్తూరు, పీలేరు, నగరి పరిధిలోని వృక్షశాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీకపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఒకటవ తేదీ శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు అత్యంత వేడుకగా జరుగనున్నాయి. ఈ మేరకు గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా స్వామి వారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేపట్టారు. సాయంత్రం మూషిక వాహనంపై శ్రీవినాయక స్వామివారు పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. తర్వాత అర్చక పండితులు శాస్త్రబద్ధంగా అంకురార్పణ ఘట్టాన్ని నిర్వహించారు.

వరసిద్ధుని సేవలో..


మ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యుడికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి

కాణిపాకం : కాణిపాక వరసిద్ది వినాయక స్వామిని గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యూమన్‌రైట్స్ కమిషన్ జ్యుడిషియల్ మెంబర్ సుబ్రమణ్యం దర్శించుకున్నారు. ఆయనకు ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికారు. అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటంతో సత్కరించారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నాగలాపురం: మండలంలోని సురుటపల్లి పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆలయ మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి ఆధ్వర్యంలో కార్యనిర్వహణ అధికారి కె.రామచంద్ర రెడ్డి పర్యవేక్షణలో 11 రోజులపాటు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు గురువారం ఆలయ నిర్వాహకులు గ్రామ దేవత పొన్నెమ్మకు విశేష అభిషేక పూజలు, అలంకరణలు చేశారు. తదనంతరం మహాసంకల్పం, మహా దీపారాధన నిర్వహించారు. 9 గంటలకు శ్రీవిఘ్నేశ్వర స్వామి వారికి అభిషేకం, సాయంత్రం 4 గంటలకు వాస్తుశాంతి, అంకురార్పణ ప్రక్రియ జరిపారు. రాత్రి 7 గంటలకు దేవత పొన్నెమ్మను మూషిక వాహనంపై మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు చిత్ర రఘు, సత్య, ఆర్ఎస్ భవన్ నిర్వాహకులు రవీంద్ర, మునస్వామి, అజిత్, విక్రం తదితరులు పాల్గొన్నారు.